

మొబైల్ ఆధార్ క్యాంప్ ప్రారంభం



మొబైల్ ఆధార్ క్యాంపులు ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న మొబైల్-ఆధార్ క్యాంపులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న మండలాలలో మొబైల్-ఆధార్ క్యాంపులు నిర్వహించబడతాయని, సంబంధిత మండలాల సచివాలయాలలో క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ క్యాంపులలో ఆధార్ కార్డు లేని వారు నూతన కార్డు కోసం ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ కార్డులో మార్పులు, బయోమెట్రిక్ అప్డేట్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. మొబైల్ ఆధార్ క్యాంపును ప్రారంభించిన అనంతరం బొల్లెపల్లి అసిస్టెంట్ అనే పిల్లవాడికి సంబంధించిన ఆధార్ అప్‌డేట్ చేసి సంబంధిత ఫారంను చిన్నారికి అందించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర వవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రాజులకాలనీలో సుండుపల్లిరోడ్డు నుంచి ఇ. నారా యణ ఇంటి వరకు రూ.27 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వంలో రాయచోటి ము న్సిపాలిటీని ఆదర్శంగా వంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వస తుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎన్‌ఆర్‌ట్రస్ట్ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం

ఇటీవల వచ్చిన సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆలిండియా ర్యాంక్‌లలో 768 వ ర్యాంకును సాధించి కలికిరి సైనిక్ స్కూల్లో సీటు పొందిన నిరుపేద విద్యార్థి నూలివీడు గ్రామానికి చెందిన కాల్వపల్లి చరణ్ కుమార్ రెడ్డి చదువు ఖర్చుల నిమిత్తం మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ .50 వేల రూపాయలు నగదును మంత్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే ప్రతి పేద విద్యార్థికి ఎంఎన్‌ఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ చేయూతనిస్తుందని తెలిపారు.

యూరియాపై దుష్ప్రచారాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గ్రామస్థాయి వరకు అందుబాటులో ఉన్న యూరియా పై సమాచారాన్ని రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఎరువుల అందుబాటుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్, జెసి ఆదర్శ రాజేంద్రన్ రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో యూరియా కొరతను కృత్రిమంగా సృష్టించారని, జిల్లాలలో కొరతలేదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్లను, ఎస్‌పిలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో మండల, గ్రామస్థాయిలలో రైతులకు అందుబాటులో ఉన్న యూరియా పై తగిన సమాచారాన్ని చేరవేసి యూరియా పై ఉన్న దుష్ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మండల, గ్రామస్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ లేదా పెల్లి కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారిని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న జెసి

యూరియా స్టాక్‌ను తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రూరల్ మండల పరిధిలోని చిన్న ముక్కపల్లి-2 సచివాలయంలోని రైతు సేవ కేంద్రం, రాయచోటి లోని ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలపై బుధవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నముక్క పల్లి -2లో నిలువ చేసిన యూరియా స్టాక్‌ను పరిశీలించి వ్యవసాయ అధికారులకు తగుసూచనలు జారీ చేశారు. అనంతరం తహశీల్దార్‌తో నరసింహాకుమార్‌తో కలిసి పట్టణంలోని జాఫర్ సాబ్ ఎరువు దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చే శారు. ఆ షాపు యాజమా న్యం నిర్వహిస్తున్న రిజిస్టర్ల ను పరిశీలించి తగు సూచన లు చేశారు. దిగువ అబ్బవరం గ్రామంలో జరుగుతున్న స్వామిత్ర సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి మండల సర్వేయర్, పంచా యతీ సెక్రటరీలకు తగు సూచనలు జారీ చేశారు.

బొప్పాయికి కలెక్టర్ నిర్ణయించిన

ధర అమలు చేయాలి

ప్రజాశక్తి రాజంపేట అర్బన్

బొప్పాయి రైతులకు కలెక్టర్ నిర్ణయించిన ధరలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, రైతు సంఘం చిట్వేలి మండల అధ్యక్షులు ఏదోటి ఆదినారాయణ రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనను కోరారు. ఈ మేరకు ఆమెకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి, పుల్లంపేట, పెనగలూరు, మండలాల్లో బొప్పాయి రైతులు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని, కోడూరు లో బయట ప్రాంతాల నుంచి వచ్చిన సేట్లు, స్థానిక దళారులు సిండికేట్ అయి రూ .16 నుంచి రూ. 7 వరకు ధర తగ్గించారని తెలిపారు. రైతుల ఆందోళనలతో, ఆగస్టు 1 న లెక్టర్ జోక్యంతో సేట్లు, దళారులు, రైతులతో అనంతరాజుపేట లోని ఉద్యాన కళాశాలలో సమావేశమై ఆగస్టు 5 వరకు రూ 9 నుంచి రూ. 10 అమలు చేయాలని నిర్ణయించారని గుర్తు చేశారు. ధర తగ్గించాలంటే తిరిగి సమావేశమై కలెక్టర్ నిర్ణయిస్తేనే ధర తగ్గించాలని హెచ్చరించామని చెప్పారు. కానీ పది రోజులు మాత్రం తొమ్మిది రూపాయలు అమ్మారని, తిరిగి పది రూపాయలతో కొనుగోలు చేయాల్సింది పోయి రూ. 7 ధర తగ్గించారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతు సంఘం , సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తే తిరిగి సబ్ కలెక్టర్ ఆదేశాలతో పది రోజులు తొమ్మిది రూపాయలతో కొనుగోలు చేశారన్నారు. కానీ తిరిగి ఆగస్టు 26 నుండి బొప్పాయి ధర ఐదు రూపాయలకి తగ్గించేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకు పోతారని, ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు కావాలంటే రూ 15 లుతో కొనుగోలు చేయాలని కోరారు. నవంబర్ వరకు పంట కోతలు ఉంటాయని తెలిపారు. ధర తగ్గించి ఐదు రూపాయలు నిర్ణయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తక్షణం గిట్టుబాటు ధర కలెక్టర్ నిర్ణయించిన పది రూపాయలు అమలు చేయించాలని కోరారు. దళారుల వ్యవస్థ రద్దు చేయాలని, నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయించి బొప్పాయి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, కలెక్టర్ తో మాట్లాడి త్వరలో సమావేశపరిచి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేశామని, ఆగస్టు 15 వరకు కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, దాన్ని ఉపయోగించుకోవాలని, రైతులు ఫిర్యాదు చేసిందాన్ని బట్టి చర్య తీసు కుంటామని ఆమె వివరించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్తపల్లి ఈశ్వరయ్య, వెంకటరమణ, హరి చరణ్ చౌదరి, కందుల సుబ్రహ్మ ణ్యంనాయుడు, రైతు సంఘ నాయకులు బి.శివకేశవరెడ్డి పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

6న చలో విజయవాడ : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి కోరారు. పట్టణంలోని ఐటిఐ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యారంగ సమస్యల పై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్కడా చర్చించిన దాఖలాలు లేవన్నారు. పాఠశాలల, కళాశాలలోకి విద్యార్థి సంఘాల అనుమతి లేదంటూ ఇచ్చినటువంటి జీవోలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను రూ 6400 కోట్లు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నెలకు ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు రూ 3000 పెంచాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల లో ఖాళీగా ఉన్న కమాటి, కుక్కు, హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేయడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు హర్షవర్ధన్, బాబు, మహేష్, మనోజ్, శివ, పెంచలయ్య, రామ చైతన్య, హేమంత్, వినయ్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జిల్లా ఆస్పత్రుల్లో సౌకర్యాలు శూన్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధనా సుపత్రిలో సౌకర్యాలు శూన్యంగా మారాయని, అత్యవసర కేసులు వస్తే తిరుపతి, బెంగళూరుకు రెఫర్ లు చేస్తున్నారని వైసిపి జిల్లా కార్యాచరణ కార్యదర్శి వలసపల్లి నాగరాజురెడ్డి ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లెను మెడికల్ హబ్ చేసి పేదలకు వైద్య సౌకర్యాలు పెంపొందించేందుకు గత వైసిపి ప్రభుత్వం కృషి చేస్తే, 14 నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం వైద్య సౌకర్యాలు నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను ప్రయివేటు పరం చేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. ప్రభుత్వ వైద్యం పేదలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లెను మెడికల్ హబ్ చేయడానికి ఎంపీ మిథున్‌రెడ్డి ఎంతో చొరవ తీసుకుని జిల్లా అసుపత్రిలో సౌకర్యాలు, మెడికల్ కాలేజ్ తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మదనపల్లె జిల్లా ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసి, వైద్య సేవలు అందకుండా చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, నేతలు ప్రజావసరాలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకార్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలను ప్రయివేట్ పరం కాకుండా చూడాలని కోరారు.

mitts డీమ్డ్ యూనివర్సిటీలో

మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథి శివమహేష్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో ఎంబిఎ, ఎంసిఎ ఎం.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్‌ఎఫ్) సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ శివ మహేష్ టంగుటూరు హాజరయ్యారు. ఆయనతో పాటు యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ ఎన్. ద్వారకానాథ్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్ కుమార్, డీన్ ఇంటర్నేషనల్ డాక్టర్ శ్రీమంత బసు, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ భానుశ్రీ, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ శివ మహేష్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో టెక్నాలజీతో పాటు నూతన ఆవిష్కరణలు తెలుసుకోవడం అత్యవసరమని తెలిపారు. విద్యార్థులు వ్యాపారవేత్తలుగా మారడానికి కోర్సు కన్నా ఆలోచనా విధానం ముఖ్యమని సూచించారు. యూనివర్సిటీ అందించే ల్యాబ్‌లు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, లైబ్రరీ వంటి వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ కోర్సుల విద్యార్థులు కలిసి మల్టీడిసిప్లినరీ ప్రాజెక్టులపై పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. తాను బయోమెడికల్ ఇంజినీరింగ్ విద్యార్థి అయినప్పటికీ, కొత్త ఆలోచన ఆధారంగా ఒక కంపెనీ స్థాపించానని ఉదాహరణగా చెప్పారు. విద్యార్థులు కూడా తమ ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చుకోవాలని, భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. వైస్ చాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉన్నత స్థాయికి ఎదగడానికి మిట్స్ యూనివర్సిటీలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

భారీ స్కోర్ దిశగా కడప జట్టు



తలపడుతున్న కడప, కర్నూలు జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా బుధవారం వైయస్ రాజారెడ్డి ఎ సి ఎ స్టేడియంలో కడప కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 81.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 304 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని నాగచాతుర్య 53, విజయ్ రామిరెడ్డి 62 (నాట్ అవుట్), శివ కేశవ 43, ఆయుబ్ 36 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని తనీష్ 3 వికెట్లు తీసుకున్నాడు.

హోరాహోరీగా అనంతపురం, నెల్లూరు మ్యాచ

కె ఎస్ ఆర్ ఎమ్ క్రికెట్ మైదానంలో అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ హెూరాహెూరీగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని పవన్ రిత్విక్ 50, మాధవ్ 56 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. భార్గవ్ 2, ప్రవీణ్ కుమార్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రశాంత్ 90, అర్జున్ టెండూల్కర్ 52 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నారాయణ రెండు మాధవ్ రెండు వికెట్లు తీసుకున్నారు.

మెడిసిన్‌లో సీటు సాధించిన నవ్య దీపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని చామంతుల నవ్యదీపిక నీట్‌లో మంచి ర్యాంకు సాధించి కడప రిమ్స్ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు సాధించినట్లు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం నవ్యదీపికను, ఆమె తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు వన్నెతెచ్చిన విద్యార్థి మదనపల్లికి కూడా వన్నె తీసుకొచ్చారన్నారు. తోటి విద్యార్థినులు నవ్య దీపికను స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి భవిష్యత్తులో మరిన్ని మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. అందుకు తగిన శిక్షణ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపల్ అంద జేస్తారన్నారు. బోటని అధ్యాపకురాలు శ్రీదేవి రెండేళ్లు నవ్య దీపికకు శిక్షణిచ్చి మెడికల్ సీట్ సాధనలో మార్గదర్శకులుగా నిలిచారని చెప్పారు. నవోదయ కళాశాల సౌజన్యంతో స్కాలర్‌షిప్, స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. s ఫిజిక్స్ లెక్చరర్ చంద్రమోహన్, శ్రీదేవి, సాయి శంకర్ రెడ్డి, ఇతర అధ్యాపక బృందం అమ్మాయి సాధించిన విజయాన్ని అభినందించారు. బాటనీ లెక్చరర్ శ్రీదేవి రూ.10 వేలు, ప్రిన్సిపల్, ఫిజిక్స్ లెక్చరర్ చంద్ర మోహన్ మరో రూ.5వేలు వెరసి రూ. 15 వేలు బాలికకు ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు. బాలిక తండ్రి ఆటో డ్రైవర్అని, ఇలాంటి పేదింటి బిడ్డలు కళాశాల నుండి ఇంజినీరింగ్, మెడికల్, అగ్రికల్చరల్ విభాగాల్లో కళాశాల నుండి ఎంపిక అవుతున్నారని , ఇది ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.



నవ్యదీపికను సన్మానిస్తున్న అధ్యాపకులు



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

కొద్ది రోజులు ఓపిక పట్టండి : జగన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొద్ది రోజులు ఓపిక పట్టండి వచ్చేవన్నీ మంచి రోజులే అని, వైసిపి నాయకులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం పట్టణంలోని తన నివాసం వద్ద పలువురు నియోజక వర్గంలోని పలువురు ముఖ్య నేతలు ఆయన కలిసి కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలు ఎక్కువయ్యాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బాధలు, కష్టాలు, సమస్యలు కొద్దిరోజులేనని తాను ఉన్నానంటూ భరోసా ఇచ్చి ధైర్యాన్ని నింపారు.

నిష్పక్షపాతంగా విచారించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : విద్యార్థినులను లైంగికంగా వేధించి సస్పెండ్ అయిన అధ్యాపకులు సుదర్శన్‌పై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, మండల కార్యదర్శి రెడ్డి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాలలో స్పెషల్ కమిటీ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఎఐఎస్‌ఎఫ్ నాయకులు స్పెషల్ కమిటీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా మాట్లాడి, లైంగికంగా వేధించిన అధ్యాపకుడిని ఫిబ్రవరి 12న విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. సస్పెండ్ అయిన ఒకటిన్నర నెలకే మళ్లీ ఉద్యోగంలో చేరడం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం జరిగిన విచారణలో అప్పటి ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులను విచారించడకుండా ప్రస్తుతం ఉన్నవారిని విచారిస్తే నిజాలు ఎలా తెలుస్తాయన్నారు. గతంలో ఉన్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు విచారించి, విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన స్పెషల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిష్పక్ష పాతంగా విచారణ చేపడుతామని విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కేసులు అధిక సంఖ్యలో రాజీ అయ్యేలా చూడాలి

- వైఎస్‌ఆర్ కడప జిల్లా జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్ పోలీసు అధికారులను కోరారు. బుధవారం కడప జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదనలు పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా కానీ లేదా districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com ద్వారా కానీ సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట ఎఎస్‌పి మనోజ్ హెగ్డే, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎ.వెంకటేశ్వర్లు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం. ఆర్ కృష్ణమోహన్, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి. రాజేంద్రప్రసాద్, ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి. భావన, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్



వరి నాట్లు పరిశీలిస్తున్న ఎపిఎం ఖాదర్‌వలి

వరి సాగులో కాలిబాటలు ముఖ్యం

ప్రజాశక్తి-వీరబల్లి

వరి సాగులో కాలిబాటలు చాలా ముఖ్యమని, మంచి దిగుబడి వస్తుందని వెలుగు ఎంపిఎం ఖాదర్‌వలి అన్నారు. బుధవారం కమ్మపల్లె రాంప్రసాద్ రైతు పొలంలో వరినాటులను వారు పరిశీలించారు. వీరబల్లి, సోమవరం, గ్రామాలను సమీకృత వ్యవసాయ పథకంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వరినారు కొనలు కత్తిరించడం వల్ల ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. కాలిబాటలు ఉండడంవల్ల మొక్కకు కావలసిన గాలి, వెలుతురు అంది చీడ, పీడలకు అవకాశం ఉండదని చెప్పారు. వారి సాగులో అజోళ్ల వేయడం వల్ల మంచి పోషకాలు అందుతాయన్నారు. దీనివల్ల వరి పిలకలు దుబ్బు చేయడంతోపాటు చీడపీడలనుంచి ఎంతో రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. అన్నివైపుల ఎరువులు సమానంగా వేయడంతో పాటు సులభంగా పురుగుమందులు పిచికారి చేయ వచ్చన్నారు. పంట కోత దశలో కాలి బాటలు ఉపయోగ పడ తాయన్నారు. వరినాట్లు వేసేటప్పుడు మొలకలు దగ్గరగా నాటడంవల్ల తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉందని, అందు వల్ల నాట్ల సమయంలో కాలిబాటలు వేయడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరు తుందని వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం సిసి గంగా ధరం, మండల యాంకర్ పర్సన్ అనిత, సిఆర్‌పి రెడ్డెమ్మ, ఫార్మర్ మిత్ర, వెంకటేష్ పాల్గొన్నారు.




ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా 'పామిలేటి'

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లి ఇంచార్జ్ తహశీల్దార్‌గా ఎన్.పామిలేటి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహసిల్దార్ తపస్విని వ్యక్తిగత పనులపై 15 రోజులు సెల వులలో వెళ్లడంతో వారి స్థానంలో వాల్మీకిపురంలో తహశీ ల్దార్‌గా విధులు నిర్వహి స్తున్న పాలిలేటిని నిమ్మనపల్లె ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఆదేశా లిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఆయన నిమ్మనపల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. రెవెన్యూ కార్యాలయంలోని సిబ్బంది, విఆర్‌ఒలు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందు బాటులో ఉంటూ రెవెన్యూ సమ స్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. పిజిఆర్ ఎస్‌లోని ఫిర్యా దులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విఆర్‌ఒలకు సూచించారు. కార్యక్ర మంలో రీసర్వే డిటి సిరాజుద్దీన్, ఆర్‌ఐ రమేష్, రాంప్రసాద్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా గణపతి నిమజ్జనం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఎన్టీఆర్ నగర్ వద్ద వినాయకచవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకునికి 8 రోజు లు పాటు పూజలు నిర్వహించా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బాణాసంచా పేలుస్తూ యువ కులు రంగులు చల్లుకుం టూ ఊరేగింపు చేపట్టారు. అనంతరం కన్యక చెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వేలంలో రూ.45వేలు పలికిన లడ్డూ

లడ్డూ వేలం పాటలో రూ.45వేలు పలికిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్టీ ఆర్‌నగర్‌కు చెందిన రేగిమడుగు సుబ్బారావు వేలంలో లడ్డూను దక్కిం చుకు న్నారు. రేగి మడుగు సుబ్బారావును మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్ లైన్ సేవలకు 1098

ప్రజాశక్తి - ఖాజీపేట : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సేవలను విద్యార్థుల సద్వినియోగం చేసుకొని భరోసాగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తెలప వచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి, భారతి, సోషల్ వర్కర్ లక్ష్మీప్రసన్న, వన్‌స్టాప్ పాల్గొన్నారు.

దయనీయంగా సత్యవతి నది

- ముళ్ల పొదలు, వ్యర్థాలతో నిండిన వైనం
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



ముళ్లపొదలతో నిండిన సత్యవతి నది

ప్రజాశక్తి-కలకడ

కలకడ సత్యవతి నదిలోని నీరు కలుషితమై మురికి కూపంగా మారింది. వర్షపు నీటితోపాటు ఊరి డ్రైనేజీ అందులోకి వచ్చి చేరుతోంది. దీనికి తోడు చికెన్ వ్యర్థాలను ఇష్టానుసారంగా నదిలో పడేస్తున్నారు. మురికి నీటిలో పందులు చేరి దుర్గంధం వెదజల్లుతుండడంతో జనం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇక దోమల బెడద సరేసరి. దీంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రమైన కలకడ సత్యవతి నదికి చాలా చరిత్ర కలిగి ఉన్నట్లు పూర్వీకులు చెబుతుం టారు. ప్రస్తుతం సత్యవతి నది దుస్థితి చాలా దీనంగా మారింది. గతంలో ఈ నదిలో ఎప్పుడూ కూడా నీరు ప్రవహిస్తూ తాగునీరుగా కలకడ వాసులకు ఉపయో గపడుతుండేదని చెబుతున్నారు. ప్రస్తుతం ముళ్ళ పొదలు, ముళ్ళ కంపలు, చెత్త చెదారంతో నిండిపోయి అసలు ఈ ప్రాంతంలో నది ఉందా అన్నట్లు మారిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యవతి నది తీరంలో మరో గ్రామం దేవలంపేట వెలసింది. ఇక్కడ శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం కూడా ఉంది. ఈ ఆలయానికి సత్యవతి నదికి పూర్వం నుంచి చరిత్ర ఉంది. ఈ చరిత్రను ఆధారంగా సత్యవతి నదిగా పేరును కూడా పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నది మాత్రం పురోభివృద్ధికి నోచుకోకుండా ముళ్లపొదలు, వ్యర్థాలతో నిండిపోయి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చికెన్, మటన్ కేంద్రాలలో నుంచి మలిన పదార్థాలను ఈ నదిలో వేస్తుండడంతో నది పరివాహక ప్రాంతం దుర్గంధపరంగా మారి రోగాలకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా గాలికొదిలేయడంతో ఇటువంటి దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టి నదిలోని ముళ్లపొదలు, వ్యర్థాలను తొలగిస్తే నదీ తీర ప్రాంతాల ప్రజలకు దాహార్తి తీరడమే కాకుండా పంట పొలాలు సైతం పండేందుకు అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్య వతి నదిలో పారిశుధ్య చర్యలు చేపట్టి పూర్వపు స్థితికి తీసుక రావాలని కోరుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు



కలకడ : మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కలకడ

నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగు ఇస్తుందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ అన్నారు. మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మోహన్, డాక్టర్ మల్లికార్జున వారి ఆధ్వర్యంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సావాలలో గత నెల 25 నుంచి ఈనెల 8వరకు జరుగుతున్న నేత్రదానం కార్యక్రమంలో భాగంగా డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జయభారతి అధ్యక్షతన మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకత, ఎవరు నేత్రదానం చేయవచ్చు, ఎవరిని సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో నేటికీ 1.2మిలియన్ల మంది కార్నియల్ అంధత్వంతో బాధ పడుతున్నారని చెప్పారు. ప్రతి సంవత్సరం 20వేల నుంచి 30వేల కొత్త కేసులు ఈ కార్నియల్ అంధత్వంతో నమోదు అవుతున్నాయన్నారు. ఈ కార్నియల్ అంధత్వానికి కారణం కార్నియాకు దెబ్బ లేదా గాయం కావడం, పోషకాహర లోపం, అంటువ్యాధులు సంభవించడం, రసాయనిక చర్యల వల్ల జరుగు ప్రమాదాలు, జన్యు పరమైన జబ్బులు, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్ఫెక్షన్లు కావచ్చని వివరించారు. నేత్రధానం వల్ల ఇద్దరు దృష్టి హీనులకు నేత్ర జ్యోతి లభిస్తుందని, కంటి బ్యాంకులో ఉన్న వెయిటింగ్ లిస్ట్ ప్రకారం అవసరం ఉన్న రోగికి కబురు అందించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయభారతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి పుష్ప కుమారి, అధ్యాపకులు రమణయ్య డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాజమ్మ,విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** నేత్ర ద్రానం ఒక గొప్ప కార్యమని మదనపల్లె ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ మరణానంతరం తమ కళ్ళు దానం చేయడం ద్వారా, దాతలు కార్నియాను మార్పిడి చేయించుకున్న ఇద్దరు వ్యక్తులకు ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందన్నారు. ఇది మతాన్ని, సామాజిక ఒత్తిడిని అధిగమించి, అంధత్వాన్ని నయం చేయడానికి, ఎంతోమంది జీవితాలను మెరుగుపరచడానికి సహాయపడుతుందని వివరిం చారు. కార్యక్రమంలో వైద్యులు,ఆప్తాలమిక్‌టెక్నీషియన్ ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తగిన మోతాదులోనే ఎరువులను వాడాలి :ఎఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పంటలకు తగిన మోతాదులోనే ఎరువులను వాడాలని మండల వ్యవసాయ అధికారిని మంజుల తెలిపారు. బుధవారం అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగు చేసిన వేరుశెనగ పంటలను పరిశీలించారు. వేరుశనగ పంటను సాగు చేయడానికి ముందుగా రైతులు లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. నత్రజని కలిగిన ఎరువులను దుక్కులలో వాడాలన్నారు. అనంతరం చివరదుక్కిలో పశువుల ఎరువును వాడడం వలన పంటకు తగిన పోషకాలు అందుతాయని తద్వారా మంచి దిగుబడులను పొందవచ్చు అన్నారు. వేరుశనగ పంటకు రెండుసార్లు కలుపు తీయాలని సూచించారు. పంటలకు తగిన మోతాదులో ఎరువులను వాడడం వలన పంట ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. వేరుశనగ పంటలో అంతర్ పంటలను సాగు చేయాలని సూచించారు. . రైతులు ఏ పంటలను సాగు చేసిన ముందుగా వ్యవసాయ అధికారుల సూచనలను, మేలైన యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని వివరించారు. అనంతరం అగ్రహారం రైతు సేవా కేంద్రం వద్ద 20.25 మెట్రిక్ టన్నుల యూరియా ను మండల రైతులకు పంపిణీ చేశామన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన యూరియాను, ఇతర ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 20.25 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామని, మరో



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

రెండు రోజులలో మరో 20 మెట్రిక్ టన్నుల యూరియా ను మండలానికి తెప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియాను అందించడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసిందన్నారు. ఇతర మండలాల రైతులకు మండలంలో యూరియా ఇవ్వడం జరగదన్నారు. కేవలం మండలంలోని రైతులకు మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం :'ముక్కా'



ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని బావికాడపల్లి పంచాయతీలోని గ్రామ పంచాయతి రామలింగాపురం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి చేసి, దక్షిణపల్లి గ్రావెల్ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రహదారి సదుపాయాలు అత్యంత కీలకమని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మరిన్ని పనులను త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పథకాల ద్వారా సాధ్యమైనంత వరకు మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ప్రతి గ్రామంలో మౌలిక వసతులను మెరుగు పరుస్తోందని, రోడ్డు నిర్మాణం, తాగునీటి వసతి, వైద్య సదుపాయం వంటి అవసరాలపై దృష్టి సారించి కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చెబుతుందని.. ప్రజల సహకారంతో ఇదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతామని పేర్కొన్నారుగ్రామ ప్రజలు అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేసి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఆరే సుధాకర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ ముద్ద సుభాష్ రెడ్డి వెంకటసుబ్బయ్య యాదవ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రయ్య నాయుడు, మాజీ మండలాధ్యక్షులు కృష్ణమనాయుడు,నారాయణ నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి సమష్టి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో వైసిపి బలోపేతానికి ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. రెడ్డికోట పంచాయతీ మేకలవారిపల్లెలో వైసిపినాయకులు రమణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నాడు అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుక్కలపల్లెలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. మద్దిమాకులపల్లి పంచాయతీ కుడుములవారిపల్లెలో వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి తండ్రి అనారోగ్యంతో మృతి ఏంది నా విషయమై వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన తీరు భయభ్రాంతులను చేసేందుకు తప్పుడు కేసులు పెట్టి బాధ పెడుతున్న విషయాలను ప్రజలకు



ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలలో పార్టీ మండల కన్వీనర్ చౌడేశ్వరి, నాయకులు కిషోర్ రెడ్డి, కన్యమడుగు సురేంద్రనాథ్, తాళ్ల చంద్రశేఖర్, పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటు ఆరోగ్యానికి హానికరమని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మినీ సచివాలయంలో డాక్టర్ ఖాజా మొద్దీన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ మీకు కేటాయించున ఇళ్లల్లో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు అయితే వెంటనే రక్త పరీక్ష చేయాలని సూచించారు. వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్ మాత్రమే వెళ్లాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని తెలిపారు. దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమములో బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంతికుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్‌కుమార్, సోమలింగారెడ్డి, శేషగిరి నాయక్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్మీకంపోస్ట్ ఎరువులు తయారీ పై అవగాహన సిబ్బంది

వర్మీకంపోస్టు తయారీపై అవగాహన

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ చెత్త నుంచి సంపద కేంద్రం నుంచి వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ భానుప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం చెంత నంచి సంపద కేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చొరవ తీసుకోవాలని అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల వద్ద చెత్తాచెదారం, గడ్డి, ముళ్ళపదలో ఉండడం చూసి వాటిని వెంటనే తొలగించి ఆహ్లాదకర వాతా వరణం కలిగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్మి కంపోస్టు ఎరువును తయారుచేయు విధానాన్ని గురించి తెలియజేసి, దీని ద్వారా ఉన్న లాభాలను వివ రించినట్లు తెలిపారు. చెత్తతో సంపద తయారు చేయు కేంద్రాల వద్ద వర్మీ కం పోస్టు ఎరువు అమ్మకానికి సిద్ధంగా ఉందని, రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజ లు ఈ వర్మీ కంపోస్ట్ ఎరువును ఉపయోగించి తమ ఇళ్ల, పొలాల వద్ద ఉన్న చెట్ల కు, పొలాలకు ఉపయోగించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శైలజ, పంచాయతీ కార్మికులు, పాల్గొన్నట్లు తెలిపారు.



గృహ నిర్మాణదారులకు సూచనలు ఇస్తున్న డిఇ మురళి

త్వరగా గృహాలు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జాగువారి పల్లి, దలవాయిపల్లి, కొత్తపేట, అనంతంపల్లి గృహ నిర్మాణ లేఅవుట్స్ లబ్ధిదారులతో డిఇ మురళి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ దశల్లో ఆగి ఉన్న గృహాలన్నీ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు అదనపు నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. అందుకు అనుగుణంగా లబ్ధిదారులు ముందుకొచ్చి తమ కేటాయించిన గృహాలను పూర్తి చేసి, త్వరలో జరగబోయే గృహప్రవేశాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి ఎంపీడీవో జయశ్రీతో సమన్వయం చేసుకోవాలని, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ప్రభుత్వ లక్ష్యాలను త్వరగా చేరుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఇ హౌసింగ్ విజయ్‌కుమార్, సిఒ గౌస్‌ఖాన్ పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని మండలం రెడ్డిపల్లి చెరువు కట్ట ఆవరణలో కొత్తగా నిర్మించిన శ్రీవారాహి కేఫ్ అండ్ రెస్టారెంట్ కటికం నవీన్ కుమార్ ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్ మరియు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ రిబ్బన్ కటింగ్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధునిక వసతులు కలిగిన ఆహార కేంద్రాలు ప్రారంభమవడం ఆనందదాయకమని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు యువతకు ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధవటం కోట ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప జిల్లాకు పూర్వం జిల్లా కేంద్రంగా వెలుగొందిన సిద్ధవటం కోట చరిత్ర ఎంతో గొప్పదని, ప్రభుత్వం ప్రతి సంవత్సరమూ కోట ఉత్సవాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవ అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంత రావు అధికారులను కోరారు. బుధవారం కడపలోని కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక పితామహుడు సంస్థ వ్యవస్థాపకులు సిద్ధవటం సీతారామయ్య ఆశయాల సాధనకు సంస్థ పని చేస్తుందని చెప్పారు. సిద్దులు, ఋషులు , యోగుల ఆవాసమైన సిద్ధవటం తాలూకా ప్రాంతంలో రాష్ట్రంలో ఎక్కడ లేనన్ని శివాలయాలు, ప్రాచీన దేవాలయాలు, శాసనాలు, శిల్ప సంపద ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని కళాకారులను ఏకం చేసేందుకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు తమకు దగ్గరలో ఉన్న ప్రాచీన పర్యాటక ప్రదేశాల వద్ద ప్రదర్శన చేసి ఎంట్రీలను పంపాలని సూచించారు. ఇందులో ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ టైటిల్ గెలుచుకునేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. వివరాల కోసం 83 09710250లో సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

మదనపల్లెలో అమానుష ఘటన

-చిరు వ్యాపారిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉన్మాదులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఉన్మాదులు రెచ్చిపోయారు. వ్యాపారిపై పెట్రోల్ పోసి తగలబెట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం ఉదయం వెలుగు చూసిన అమానుష ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బికెపల్లి వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న రమేష్‌నాయక్ స్థానికంగా ఉంటున్న మహబూబ్ బాష చెందిన ఇంటిని అద్దెకు తీసుకుని గత ఐదేళ్లుగా చిల్లర దుకాణం, జిరాక్స్ సెంటర్ నిర్వహించు కుంటున్నాడు. మహబూబ్ బాషాతో అస్థి తగాదాలు ఉన్న ఖాలేషా, ఖాదర్‌బాషా మరికొందరిని వెంటబెట్టుకుని వచ్చి చిల్లర దుకాణం షెట్టర్‌ను పగల గొడు తుండగా రమేష్ నాయక్ అడ్డుకున్నాడని తెలిపారు. ఆగ్రహంతో తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను రమేష్ నాయక్ పోసి నిప్పంటించి పరారయ్యారు. మంటల్లో చిక్కుకుని కేకలు పెడుతున్న బాధితున్ని కుటుంబీకులు వెంటనే మంటలు ఆర్పి, స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు గల పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.